
సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ׀ 9 ׀ జూలై ׀ 2024



అంగన్‌వాడీ కేంద్రాల మూత

రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడడంతో అక్కడ పౌష్టికాహారం సరిగా అందడంలేదు. 10లో▸



పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. 10లో▸



ఆంక్షలు విధిస్తే ఊరుకోం

రుణమాఫీ అమలుపై ఆంక్షలు విధిస్తే ఊరుకోబోమని కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి అంజయ్య డిమాండ్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

31వరకు ఆపరేషన్ ముస్కాన్

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ముస్కాన్ సమావేశంలో ప్రతిమా సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్‌-10 ఈ నెల 31 వరకు కొనసాగుతుందని చెప్పారు. బాలల హక్కులను హరించడం నేరమన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకునే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. బాలకార్మికులు చదువుకునేందుకు వసతి గృహాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాచకొండ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ టీంలు పని చేస్తున్నాయని.. ప్రతీ కేసును బాధ్యతగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేశ్వరి దేవి, ఆర్డీఓ సూరజన్ కుమార్, సాయిరామ్, అనంతరెడ్డి, సైబరాబాద్, రాచకొండ పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్‌పర్సన్ సురేందర్‌రెడ్డి, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సీడీపీఓలు, ఎన్‌జీఓలు, చైల్డ్‌లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శంకర్‌పల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటయ్య అధ్యక్షతన ఏఎన్‌ఎంలు, ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. వానాకాలం వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని ఇందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కాలనీల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. మురికి గుంతలు లేకుండా మొరం లేదా మట్టి వేయించాలని, లేకపోతే ఆయిల్ బాల్స్ వేయాలని చెప్పారు. ప్రతీ మంగళవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సీజనల్ వ్యాధులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

ఇబ్రహీంపట్నం కోర్టు ఏజీపీగా వాణి



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కోర్టు ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది దండె వాణి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఏజీపీగా తన వాదనలు బలంగా వినిపించేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా కమిటీ చైర్మన్ వెదిరే వేణుగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్తయ్య



నియామకపత్రం అందుకుంటున్న సత్తయ్య

కందుకూరు: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కందుకూరుకు చెందిన ఎగ్గిడి సత్తయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన బొక్క నర్సింహారెడ్డి, తూళ్ల వీరేందర్‌గౌడ్, అందెల శ్రీరాములు యాదవ్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు.

నామినేటెడ్ చార్జ్

కొత్త బాధ్యతలు స్వీకరించిన నేతలు

- యూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా చల్లా
- ఆర్డీసీ చైర్మన్‌గా రాంరెడ్డి
- ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా జ్ఞానేశ్వర్ నియామకం



రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, చిత్రంలో ఎంపీ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు సముచిత స్థానం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం జీఓ జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల కల్పనాభివృద్ధి సంస్థ (యూఎఫ్ఐడీసీ) చైర్మన్ పదవిని కట్టబెట్టగా, ఎల్బీనగర్ సీనియర్ నేత మల్‌రెడ్డి రాంరెడ్డికి రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ(టీఎస్ ఆర్డీసీ) చైర్మన్‌గా అవకాశం కల్పించింది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే వీరిద్దరూ ఆయా శాఖలకు చేరుకుని చైర్మన్‌లుగా బాధ్యతలు స్వీకరించారు. ఇక ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను నియమించింది. అయితే, ఈ పోస్టుపై ఆయన ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. గతంలో ఆయనకు పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని కట్టబెట్టిన ప్రభుత్వం.. తాజాగా దాని స్థానంలో కొత్తగా ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎంపిక చేసింది. ఈ పోస్టు ప్రాధాన్యత లేనిదని భావిస్తున్న ఆయన బాధ్యతలు స్వీకరించేందుకు సుముఖత చూపడం లేదని తెలుస్తోంది.

డైలమాలో జ్ఞానేశ్వర్..?

రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించే అంశంపై డైలమాలో పడినట్లు తెలిసింది. గతంలో తనకు కేటాయించిన కార్పొరేషన్‌కు బదులు.. కొత్తగా మరో కార్పొరేషన్‌కు చైర్మన్‌గా ప్రకటించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పాడిపరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవికి బదులుగా, ముదిరాజ్ సంఘం కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నియమించడాన్ని ఆయన స్వాగతించడం లేదు. తోటి సభ్యులంతా సోమవారం బాధ్యతలు స్వీకరించగా, ఆయన మాత్రం ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. అధిష్టానంతో అమితుమీ తేల్చుకునేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగే ఆయన.. గతంలో రాజేంద్రనగర్ నుంచి రెండు సార్లు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పదేళ్లుగా పార్టీ అధికారంలో లేకపోయినా.. హస్తం గుర్తునే నమ్ముకుని పని చేశారు. అప్పటి అధికార బీఆర్‌ఎస్ ఒత్తిళ్లను సైతం తట్టుకుని నిలబడ్డారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్టానం ఆదేశాల మేరకు పోటీ నుంచి తప్పుకొన్నారు. అప్పటి వరకు తను కాపాడుకుంటూ వస్తున్న తన సీటును కస్తూరి నరేందర్ ముదిరాజ్ కోసం త్యాగం చేశారు. దీంతో ఆయనకు మంచి నామినేటెడ్ పోస్టు ఇస్తామని అప్పట్లోనే పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జారీ చేసిన తొలి జాబితాలో పాడిపరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఆయన పేరును చేర్చారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బాధ్యతల స్వీకరణ ఆగిపోయింది. అయితే తాజాగా విడుదల చేసిన చైర్మన్ల జాబితాలో పాడిపరిశ్రమల అభివృద్ధి సంస్థకు బదులుగా ముదిరాజ్ సంఘం కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. ఈ అంశంపై సీఎంతో సమాలోచనలు జరుపుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

బాధ్యతలు స్వీకరించిన చల్లా

యూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా చల్లా నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 1984లో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. 1984 నుంచి 1988 వరకు ఎన్ఎస్‌యూఐ కార్యదర్శిగా, ఆ తర్వాత 1988 నుంచి 91 వరకు జిల్లెలగూడ గ్రామ అధ్యక్షుడిగా, 1991 నుంచి 95 వరకు యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా, 1995 నుంచి 2002 వరకు సరూర్‌నగర్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2002 నుంచి 2004 వరకు మలక్‌పేట బి– బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, 2010 నుంచి 2014 వరకు యునైటెడ్ ఏపీసీసీ సెక్రటరీగా, 2014 నుంచి 2018 వరకు పీసీసీ కార్యదర్శిగా కొనసాగారు. అంతకు ముందు 1989 నుంచి 1996 వరకు జిల్లెలగూడ ఉప సర్పంచ్‌గా, 2000 నుంచి 2006 వరకు సరూర్‌నగర్ జెడ్పీటీసీ సభ్యుడిగా సేవలందించారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



యూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహారెడ్డి

రాంరెడ్డి రాజకీయ ప్రస్థానం

రాష్ట్ర ఆర్డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సోమవారం సాయంత్రం ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామానికి చెందిన ఆయన 1962 ఫిబ్రవరి 10న వ్యవసాయ, రాజకీయ నేపథ్యమున్న కుటుంబంలో జన్మించారు. 1981లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. కొంత కాలం టీడీపీలో పనిచేశారు. హయత్‌నగర్ ఎంపీపీగా 2001లో ప్రజలకు సేవలందించారు. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి స్వల్పతేడాతో ఓడిపోయి రెండో స్థానంలో నిలిచారు. అనంతరం కాంగ్రెస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేశారు. అతని సతీమణి అనురాధ భర్త అడుగుజాడల్లో నడుస్తూ 1995లో తొర్రూర్ సర్పంచ్‌గా పనిచేశారు. 2020 నుంచి తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఇబ్రహీంపట్నం ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి రాంరెడ్డి స్వయనా సోదరుడు.



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

భూములను కాపాడాలి

- ఆక్రమణల తొలగింపునకు రెండు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు
- ప్రజాభవన్ ఫిర్యాదులపై వివరణ ఇవ్వాలి
- జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడాలని కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమీకృత భవన సముదాయంలో 'ప్రభుత్వ భూముల పరిరక్షణ సరస్సుల ఆక్రమణల తొలగింపు'పై రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ, పోలీసు, హెచ్ఎండీఏ లేక్స్, విద్యుత్, సర్వే జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాలను ఆక్రమణల నుంచి రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ భూములు, సరస్సుల రక్షణ, ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఏరియాలోని ఆక్రమణలను తొలగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏసీపీ స్థాయిలో రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని వివవరించారు. టీం–1(ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం), టీం–2 (రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, చేవెళ్ల) టాస్క్‌ఫోర్సు బృందాలుగా ఉంటాయని తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ పోలీసు అధికారుల సహాయంతో భూములు కాపాడుతామన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ సంగీత, ఆర్డీఓలు సాయిరాం, సూరజ్ కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ ప్రజావాణికి 110 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, డీఆర్ఓ సంగీత స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని దరఖాస్తులను ఎండార్స్ వేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో ప్రజాభవన్ నుంచి వచ్చిన దరఖాస్తులను వివిధ శాఖలఅధికారులు,ఆర్డీఓలు, తహసీల్దార్లు ఎప్పటికప్పుడు వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్, మండల అధికారులు, సూపరింటెండెంట్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 81 అమలుకు వినతి

మొయినాబాద్: జీఓ నంబర్ 81ని రాష్ట్ర ప్రభు త్వం వెంటనే అమలు చేయాలని రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ జేఏసీ) సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కలెక్టర్ శశాంకకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20,555 మంది వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసేందుకు అప్పటి ప్రభుత్వం జీఓ నంబర్ 81, 85 తీసుకువచ్చిందన్నారు. ఇందులో 61 ఏళ్లలోపు 16,758 మంది వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసిందన్నారు. 61 ఏళ్లు దాటిన వీఆర్ఏల వారసుల కారుణ్య నియామకాలు చేపడతామని చెప్పి అందుకు వారసుల విద్యార్హత సర్టిఫికెట్లు, కుటుంబ సభ్యుల ఎన్ఓసీ, అఫిడవిట్,కుల,నివాస ధ్రువీకరణ పత్రాలు స్వీకరించాన్నారు. 11 నెలలు గడుస్తున్నా ఇందుకు సంబంధించి నేటికీ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. ఈ విషయా న్ని ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కారుణ్య నియామకాలు చేపట్టే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు, ఆలయ అధికారులు

ఎల్లమ్మ కల్యాణోత్సవాలు ప్రారంభం

అమీర్‌పేట: భక్తుల కొంగు బంగారమైన బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనము, ఋత్విగ్వరణము, కలశస్థాపన, దేవాతాహ్వానం, అంకురార్పణ, పుట్ట బంగారం, గంగతెప్ప వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ సంప్రదాయ బద్ధంగా ఎదుర్కోళ్లు జరిగాయి. ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం నుండి స్వామి వారిని ఊరేగింపుగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి తీసుకువచ్చారు. సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఒగ్గుకథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నేడు 11.34 గంటలకు అమ్మవారి కల్యాణం

ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తంలో మంగళవారం ఉదయం 11.34 గంటలకు అమ్మవారి కల్యాణోత్సవం జరిపించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి అంజనీదేవి తెలిపారు. ఈ మేరకు కల్యాణ వేదికను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు.

జలమండలి ఉద్యోగిపై దాడి

- కోకాపేట కౌన్సిలర్‌తోపాటు అనుచరులపై కేసు

మణికొండ: నీటిసరఫరా విషయమై మాటామాట పెరిగి జలమండలి లైన్‌మేన్‌పై దాడికి దారి తీసింది. బాధిత లైన్‌మేన్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి కోకాపేటలో నీటి సరఫరా చేస్తుండగా కౌన్సిలర్ జి.శివారెడ్డి, అతని అనుచరులు శ్రీధర్‌ను పిలిచి కొట్టారు. కత్తితో దాడి చేశారు. శ్రీధర్ ప్రాణభయంతో అక్కడి నుంచి తప్పించుకొని వెళ్లి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లైన్‌మేన్‌పై కోకాపేట కౌన్సిలర్ శివారెడ్డి కత్తితో దాడి చేశారనే విషయం తెలుసుకుని జలమండలి జీఎం మహేందర్ నాయక్, డీజీఎం శ్రీమన్నారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డితోపాటు పలు యూనియన్‌ల నాయకులు, సిబ్బంది నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని పట్టుపట్టారు. దళితుడైన లైన్‌మేన్ చెంపపై కౌన్సిలర్ కొట్టారని, అతడి అనుచరులు కత్తితో దాడి చేశారని తెలిపారు.

బస్తీలకు సరఫరా చేయడంలేదు: కౌన్సిలర్

పేదలు నివసించే రాజీవ్ గృహకల్పకు సరిగా నీటిని సరఫరా చేయకుండా అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలకు ఎక్కువ సమయం సరఫరా చేసి వారి నుంచి లైన్‌మేన్ డబ్బులు తీసుకుంటున్నాడని కౌన్సిలర్ ఆరోపించారు. ఈ విషయమై లైన్‌మేన్‌ను అడగ్గా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. దీంతో మద్యం మత్తులో ఉన్న తన అనుచరులు దాడి చేశారని, ఇది తప్పేనని అన్నారు.

ఈ దొంగ యమా రిచ్!

- ముంబైలో నివసించేది రూ.కోటి విలువైన ఫ్లాట్‌లో..
- అనునిత్యం తిరిగేది ఆడి కంపెనీ హైఎండ్ కారులో
- హైదరాబాద్ సహా అనేక నగరాల్లో వరుస చోరీలు
- నిందితుడు సోలంకిని అరెస్టు చేసిన గుజరాత్ కాప్స్
- నగర పోలీసులకు సమాచారం ఇస్తున్నాం: వల్సాద్ ఎస్పీ



సాక్షి, సిటీబ్యూరో: రోహిత్ కనుభాయ్ సోలంకి.. ముంబై శివార్లలో రూ.కోటి ఖరీదైన ఫ్లాట్‌లో నివసిస్తుంటాడు. ఆడి హైఎండ్ కారులో సంచరిస్తుంటాడు. ఓ నగరాన్ని టార్గెట్ చేసుకుంటే అక్కడకు వెళ్లి స్టార్ హోటల్‌లో బస చేస్తాడు. సంపన్నుల ప్రాంతాలను గూగుల్ ద్వారా గుర్తిస్తాడు. అక్కడ పగలు రెక్కీ చేసి తాళం వేసున్న ఇళ్లల్లో రాత్రిళ్లు పంజా విసురుతాడు. ఈ ఖరీదైన దొంగను గత వారం గుజరాత్‌లోని వల్సాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. విచారణ నేపథ్యంలోనే హైదరాబాద్‌లోనూ రెండు నేరాలు చేసినట్లు అంగీకరించాడు. దీంతో ఇక్కడి పోలీసులకు త్వరలో సమాచారం ఇవ్వనున్నట్లు వల్సాద్ ఎస్పీ కరణ్ రాజ్ వాఘేలా ×సాక్షి×కి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సోలంకి ప్రస్తుతం ముంబ్రాలోని ఖరీదైన సొంత ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. తన పేరును అర్హాన్‌గా మార్చుకున్న ఇతగాడు ఓ మైనార్టీ యువతిని వివాహం చేసుకున్నాడు. ఆమెతో తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని చెప్తూ... కొన్నేళ్లుగా చోరీలు చేస్తున్నాడు. క్యాంపుల పేరుతో తరచు ఇల్లు వదిలి వెళ్లే ఇతగాడు కేవలం ప్రధాన నగరాలనే టార్గెట్‌గా చేసుకుంటాడు. విమానంలో అక్కడకు చేరుకుని స్టార్ హోటల్‌లో బస చేస్తాడు. గూగుల్ ద్వారా ఈ చుట్టుపక్కల ఉన్న సంపన్న వర్గాలు నివసించే ప్రాంతాలను గుర్తిస్తాడు. హోటల్‌కు చెందిన క్యాబ్‌ను బుక్ చేసుకునే ఇతగాడు పగటి పూటి అందులోనే తిరుగుతూ తాను ఎంచుకున్న ప్రాంతాల్లో రెక్కీ చేస్తాడు. తాళం వేసున్న ఇళ్లను గుర్తించి ఆ ప్రాంతాలకు సంబంధించిన లోకేషన్స్‌ను తన వాట్సాప్‌లోకి షేర్ చేసుకుంటాడు. రాత్రి వేళ కాలినడకన బయలుదేరి..సమీపంలోని ఏదో ఒక దుకాణం నుంచి చిన్న రాడ్డు, స్క్రూడ్రైవర్ వంటివి ఖరీదు చేస్తాడు. వీటిలో టార్గెట్ చేసుకున్న ఇంటి తాళాలు పగులకొట్టి నగదు, సొత్తు స్వాహా చేస్తాడు. చోరీ సొత్తును తీసుకుని మాత్రం రైలులోనే ముంబైకి చేరుకుంటాడు. ఇంటికి చేరుకునేలోపే దాన్ని అమ్మి, క్యాష్ చేసుకుని, బ్యాంక్ ఖాతాలో వేసుకుంటాడు. ఇలా గడిచిన కొన్నాళ్లల్లో గుజరాత్‌లోని వల్సాద్, వాపి, సూరత్, పోర్‌బందర్, సెల్వాల్‌లతో పాటు మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌ల్లో 19 నేరాలు చేశాడు. వీటిలో రెండు హైదరాబాద్‌లో చేసినవే. వల్సాలో జరిగిన వాపిలో జరిగిన రూ.లక్ష నగదు చోరీ కేసును వల్సాద్ జిల్లా పోలీసులు దర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలతో పాటు సోలంకి బస చేసిన హోటల్, ప్రయాణించిన విమానం టిక్కెట్ తదితర వివరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ముంబ్రాలోని అతడి ఫ్లాట్ వద్ద కాపుకాసిన పోలీసులు గత వారం అరెస్టు చేశారు. విచారణ నేపథ్యంలో జల్సాలకు అలవాటు పడిన ఇతగాడు ముంబైలోని నైట్ క్లబ్స్‌లో భారీ మొత్తం ఖర్చు చేస్తాడని తేలింది. మాదకద్రవ్యాలకు సైతం అలవాటుపడి బానిసగా మారిన సోలంకి ఏకంగా నెలకు రూ.1.5 లక్షలు వాటికే వెచ్చిస్తాడని పోలీసులు గుర్తించారు. వల్సాద్ ఎస్పీ కరణ్ రాజ్ వాఘేలా 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ...'రోహిత్ సోలంకిని విచారించిన నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని హైదరాబాద్‌ల్లో రెండేసి చోరీలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అయితే ఏ ప్రాంతంలో చేశాడనేది అతడు స్పష్టంగా చెప్పలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలోనే అతడు ఆయా నగరాల్లో సంచరించిన తేదీలతో పాటు ఇతర వివరాలను సాంకేతికంగా గుర్తిస్తున్నాం. ఆపై ఆ అంశాలకు అక్కడ పోలీసులకు తెలుపుతాం. డ్రగ్స్‌కు బానిసైన సోలంకిని రీహాబ్‌కు పంపాలని యోచిస్తున్నాం' అని పేర్కొన్నారు.

గంజాయి తెచ్చి.. పోలీసులకు చిక్కి..

- పట్టుబడిన ఆటోక్యాడ్ డిజైనర్, డెంటల్ టెక్నీషియన్

ఉప్పల్: ఒకరు ఆటోక్యాడ్ డిజైనర్, మరొకరు డెంటల్ టెక్నీషియన్. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పక్కదారి పట్టారు. గంజాయి విక్రయించి పోలీసులకు చిక్కారు. ఉప్పల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లికి చెందిన సిరిశెట్టి మోహన్ (27) రామంతాపూర్ ప్రగతినగర్‌లో నివాసముంటూ ఆటో క్యాడ్ డిజైనర్‌గా రామంతాపూర్ ఎస్ఎస్ఎల్ భవనంలో పనిచేస్తున్నాడు. కర్ణాటక హుల్సూర్ ప్రాంతానికి చెందిన బాచిపల్లి దేవానంద్(26) రామంతాపూర్ నెహ్రూనగర్‌లో నివాసముంటున్నాడు. అతడు డెంటల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. చాలీచాలని జీతాలు రావడంతో గంజాయి విక్రయిస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని ఇద్దరూ భావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరు ప్రాంతానికి చెందిన డ్రగ్స్ విక్రేత చిన్నారావుతో చేతులు కలిపారు. ఇతని వద్ద గంజాయి కొనుగోలు చేశారు. 400 గ్రాముల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించారు. మిగిలిదానిని రామంతాపూర్ నెహ్రూనగర్‌లో ఉండే పాన్‌షాప్ ద్వారా విక్రయించాలని ప్లాన్ వేశారు. ఈ క్రమంలోనే ఆదివారం దేవానంద్ తన బైక్‌పై పాన్‌షాప్ వద్దకు వచ్చాడు. 500 గ్రాముల గంజాయి నింపిన సిగరెట్ల బ్యాగ్‌ను, మరో 600 గ్రాముల గంజాయి బ్యాగ్‌ను మోహన్‌కు అందజేశాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధికారి సంధ్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

- మండల అధికారి సంధ్య

మొయినాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల అధికారి సంధ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జీపీ కార్యదర్శులు, ఏఎన్ఎంలకు డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త చెదారం, మురుగు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు తొలగింప చేయాలని చెప్పారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలన్నారు. ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ వాణి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఇందుకు గ్రామాల్లో ఏఎన్ఎంలు ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. ఇంటింటికీ తిరుగుతూ ఎవరికైనా జలుబు, దగ్గు ఉన్నట్లుగా గుర్తిస్తే తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మండల ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తలకొండపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదర్‌పల్లికి చెందిన పర్వత్‌రెడ్డి(57) గత నెల 25న విత్తనాల కోసం వెల్జాల్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గ మధ్యలో చౌదర్‌పల్లి గ్రామ శివారు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి, పర్వత్‌రెడ్డి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయం అయింది. చికిత్స నిమిత్తం పర్వత్‌రెడ్డిని మొదట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పర్వత్ సోమవారం మృతి చెందాడు. కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్వీస్ వైర్ల చోరీ

యాచారం: మండల పరిధి గడ్డమల్లయ్యగూడ గ్రామంలో వ్యవసాయ బావుల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి సర్వీస్ వైర్లను ఎత్తుకెళ్లారు. సుమారు 20 మందికి పైగా రైతులకు చెందిన బోరుమోటార్ల తీగలను కత్తిరించి చోరీ చేశారు. ఎప్పటి లాగే రైతులు సోమవారం తెల్లవారు జామున బావుల వద్దకు వెళ్లగా.. ఘటన వెలుగు చూసింది. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో వృద్ధుడి హత్య

హత్య కేసును ఛేదించిన పోలీసులు

శంకర్‌పల్లి: మద్యం మత్తులో తాతను హత్య చేసిన నిందితుల(మనుమరాలు, మనుమడు)ను శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి, సోమవారం రిమాండ్‌కి తరలించారు. సీఐ హబీబుల్లాఖన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న శంకర్‌పల్లి పట్టణ శివారులోని రెండు పడకల ఇళ్ల వద్ద నివాసం ఉండే భీమయ్య(65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే అదే రోజున హైదరాబాద్‌లో నివాసం ఉండే వృద్ధుడి మనుమరాలు దంపతులు వారి పిల్లలతో కలిసి భీమయ్య దగ్గరకి వచ్చారు. వాళ్లిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. సాయంత్రం వేళ అందరూ కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో భీమయ్య.. మనుమడి(మనుమరాలి భర్త)ని తిట్టాడు. అది భరించలేని మనుమడు ఇంట్లోని కత్తితో వృద్ధుడి గొంతుపై దాడి చేయగా.. మనుమరాలు తాత కాళ్లు గట్టిగా పట్టుకుంది. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత పిల్లలను తీసుకోని నిందితులు ఇద్దరూ పారిపోయారు. తొలుత అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టారు. భీమయ్య కాల్‌డేటా, సీసీ కెమెరా ల సాయంతో నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. వీరిని చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టి, రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జిల్లా కంది జైలుకి తరలించారు.

మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలు

పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందని పౌష్టికాహారం

మొయినాబాద్: టీచర్లు, ఆయాలు లేక రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో ఐసీడీఎస్ ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం సరిగా అందడంలేదు. మండల పరిధి శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే టీచర్ ఉద్యోగం మానుకోగా.. అంతకు ముందే ఏడాది క్రితం అనారోగ్యంతో ఆయా మరణించింది. దీంతో ఆరు నెలలుగా ఆ కేంద్రం తెరచుకోవటం లేదు. ఎత్‌బార్‌పల్లిలో టీచర్, ఆయా ఇద్దరూ ఉద్యోగాలు మానుకోవడంతో ఆ సెంటర్ మూతపడింది.

అందని పౌష్టికాహారం

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తుంది. 3–5 సంవత్సరాల పిల్లలు కేంద్రాలకు వస్తే భోజనం, గుడ్డు, పాలు ఇస్తారు. గర్భిణులకు మధ్యాహ్నం భోజనం, గుడ్డు, పాలు అందజేస్తారు. రెండు సెంటర్లు మూసివేయడంతో వారికి పౌష్టికాహారం అందడం లేదు. 6 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు బాలామృతం, గుడ్లను కేంద్రం ద్వారా ఇంటికి పంపిణీ చేస్తారు. ఇవి మూసివేయడంతో పక్క గ్రామాల టీచర్లు నెలలో రెండు సార్లు వచ్చి బాలామృతం, గుడ్లు అందజేస్తున్నారు. శ్రీరాంనగర్‌లో సురంగల్ టీచర్, ఎత్‌బార్‌పల్లిలో తోలుకట్ట టీచర్ పౌష్టికాహారాలు అందజేస్తున్నారు. 3–5 ఏళ్లలోపు పిల్లలు ప్రైవేటు బడికి వెళ్తున్నారు. అలా వెళ్లని వారు.. ఇంటి వద్దే ఉంటున్నారు. శ్రీరాంనగర్‌లో 15 మంది, ఎత్‌బార్‌పల్లిలో 10 మంది పిల్లలది ఇదే పరిస్థితి.



శ్రీరాంనగర్‌లో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

త్వరలో పోస్టుల భర్తీ

సెక్టార్ పరిధి శ్రీరాంనగర్, ఎత్‌బార్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేరు. ప్రస్తుతం పక్క గ్రామాల టీచర్లు ఈ పిల్లలకు బాలామృతం, గుడ్లు అందజేస్తున్నారు. ప్రభుత్వం త్వరలోనే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది. రిక్రూట్‌మెంట్ కాగానే రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు తెరచుకుంటాయి.

– రవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మొయినాబాద్

ఉపాధికల్పనతో పేదరిక నిర్మూలన

మొయినాబాద్ రూరల్: సమాజ సేవ, ఉపాధి కల్పించడంతోనే పేదరిక నిర్మూలనకు సహకరించిన వారవుతారని హైదరాబాద్ శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరయ్య ప్రజాపతి అన్నారు. హిమాయత్‌నగర్ గ్రామంలో 15 సంవత్సరాలుగా శివమంజు క్లే ఐడల్ మ్యానుఫ్యాక్చర్ ట్రేడర్స్‌తో మట్టి గణపతి విగ్రహాలను హోల్‌సెల్ ధరలకు విక్రయించడంతో పాటు.. ఏటా నగరంలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలకు లక్షలాది ప్రతిమలను అమ్ముతున్నారు. వీటి తయారీ ద్వారా పలువురికి జీవనోపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మట్టి విగ్రహాల తయారీలో పాల్గొంటున్న వారిని ట్రస్ట్ చైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మిరాజ్యం, ట్రస్ట్ సభ్యులు రాజు, వెంకటరామయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ తయారీదారులను సన్మానిస్తున్న చైర్మన్ వీరయ్య ప్రజాపతి

జూబ్లీహిల్స్ పబ్‌లలో తనిఖీలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పరిధిలోని ఎయిర్ లైవ్, లుఫ్ట్ పబ్‌లలో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించేందుకు పోలీసులు ఆదివారం రాత్రి స్నిపర్ డాగ్‌లతో తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిసినా, దాని ఆనవాళ్లు ఉన్నా, ఎవరైనా వాటిని ముట్టుకున్నా, టేబుళ్లు, కుర్చీలపై వాటి అణువులు కనిపించినా శిక్షణ పొందిన స్నిపర్‌డాగ్స్ ఇట్టే పట్టేస్తాయి. దీంతో పోలీసులు అణువణువూ శోధించారు. బాత్‌రూమ్‌లు, వంటరూమ్‌లతోపాటు డీజే, క్యాష్ కౌంటర్.. ఇలా అన్ని ప్రాంతాల్లోనూ గాలించారు. మహిళా కస్టమర్లను మహిళా పోలీసులతో తనిఖీ చేయించారు. పబ్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

సీఎస్‌ను కలిసిన పీసీబీ సభ్యుడు



సీఎస్‌తో పీసీబీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, కాలుష్య నియంత్రణ మండలి చైర్‌పర్సన్ శాంతకుమారిని హైదరాబాద్ సచివాలయంలోని ఆమె కార్యాలయంలో సోమవారం పీసీబీ మండలి రాష్ట్ర సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొల్యూషన్ వలన జరుగుతున్న నష్టం, బోర్డుకు సంబంధించిన పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. బోర్డులో సరిపడా సిబ్బంది లేక పనులు సకాలంలో జరగడం లేదని, దీనిపై ప్రభుత్వంతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు.

రుణమాఫీపై ఆంక్షలు విధిస్తే ఊరుకోం

ఏకకాలంలో రూ.2 లక్షల్లోపు మాఫీ చేయాలి

- కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్

యాచారం: రుణమాఫీ అమలుపై ఆంక్షలు విధిస్తే ఊరుకోబోమని, ఏకకాలంలో అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోతున్నారని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేసి, రైతుభరోసా అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలని కోరారు.

అందని సంక్షేమం..

ధరణి పోర్టల్ నేటికీ సరిచేయకపోవడంతో వేలాది మంది రైతులకు తమ భూములపై పట్టాదారు, పాసు పుస్తకాలు రాక రైతుభరోసా, రైతుబీమా, బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. వెంటనే కౌలుదారు చట్టం తెచ్చి, కౌలు రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు గొల్లపల్లి జంగయ్యగౌడ్, గోగికార్ రమేష్, నక్క శ్రీనువాస్ యాదవ్, పత్తి రాజు, నాయిని పాండురెడ్డి, పల్లపు నరేష్, శ్రీనువాస్‌గుప్తా, లింగం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫార్మాసిటీనే రద్దు చేశాం..

- భూములెందుకు లాక్కుంటాం
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి

యాచారం: 'జీవకోటికి ప్రాణహాని కలిగించే ఫార్మాసిటీనే రద్దు చేశాం. మళ్లీ పరిశ్రమలు పేరుతో రైతుల భూములు లాక్కుంటామా' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముత్యాల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీ రద్దు కాదు, సేకరించిన భూముల్లో మళ్లీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని, అథారిటీలో జమ చేసిన భూములను లాక్కుంటారని భయాందోళన చెందవద్దని ఆయన రైతులను కోరారు. కొందరు కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇదే విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి హామీ ఇచ్చారని ముత్యాల పేర్కొన్నారు. త్వరలో ఫార్మాసిటీపై ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సమీక్షించి, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తుందని హామీఇచ్చారు.



ఏజీపీగా అంజయ్య యాదవ్



షాద్‌నగర్: అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది బి.అంజయ్య యాదవ్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలోని వివిధ కోర్టులకు ఆరు మందిని అసిస్టెంట్ ప్లీడర్‌లుగా నియమించినట్లు పేర్కొంది. షాద్‌నగర్ కోర్టులో 1992 నుంచి సేవలందిస్తున్న అంజయ్యను సీనియర్ న్యాయవాదిగా పేర్కొంటూ ప్రభుత్వం గుర్తించిందని పలువురు న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా ఏజీపీకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

షాబాద్: మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును అపహరించిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఎల్గొండగూడ గ్రామానికి చెందిన కుమ్మరి చిల్కమ్మ సోమవారం ఉదయం 11.40 గంటలకు కోడలు భాగ్యలక్ష్మితో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా ద్వీచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు చిల్కమ్మ మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెలతాడు చోరీ చేశారు. తాడును గట్టిగా లాగడంతో ఆమెకు గాయాలయ్యాయి. కుడిచెవికి ఉన్న బంగారు చెవికమ్మను లాగగా చెవితెగి కిందపడిపోయింది. ఆమె కోడలు దుండగులను పట్టుకునేందుకు యత్నించగా.. బైక్‌పై ఉడాయించారు. అనంతరం చిల్కమ్మ ఫిర్యాదు మేరకు.. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా.. నిందితులకు 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని, వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తి నలుపు రంగు టోపీ ధరించాడని, వారిని చూస్తే గుర్తుపడతానని బాధితురాలు పోలీసులకు తెలిపింది.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్ట్, నాబార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అత్తాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరివేసుకున్న ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అత్తాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబానగర్ ప్రాంతానికి చెందిన సర్ఫరాజ్(20) కూలీ. ఇటీవల అతని తండ్రి షేక్ హలీం మృతి చెందడంతో కుటుంబ భారం సర్ఫరాజ్‌పై పడింది. రోజూ పని దొరకకపోవడంతో ఇల్లు గడవడం ఇబ్బందిగా మారింది. దీంతో మానసిక వేదనకు గురైన సర్ఫరాజ్ ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి.. ఇళ్లల్లో చోరీ

పట్టుబడిన నిందితులు, రిమాండ్‌కు తరలింపు

మీర్‌పేట: జల్సాలకు అలవాటు పడిన ఆ నలుగురు.. సులువుగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కారు. ఈ మేరకు సోమవారం మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, డీఐ గౌరినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌కు చెందిన ఆటో డ్రైవర్ వల్లెపు జితేందర్(20), సెంట్రింగ్ పనిచేసే రాపోలు చందు(21), లేబర్‌గా పనిచేసే రాపోలు శ్రీశైలంతో పాటు ఓ బాలుడు నలుగురు కలిసి జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. వీరిలో జితేందర్, చందు, మైనర్ వీరు ముగ్గురు పాత నేరస్తులే. ఈ నెల 1వ తేదీన బడంగ్‌పేట మారుతీనగర్‌లోని రమేష్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 125 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో క్రైం సిబ్బంది నాగరాజు, ఎల్లయ్య, శివరాజ్, విజయ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌రాజ్, నవీన్, ప్రకాశ్, రాజారెడ్డిలు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న పోలీసులు

అత్యాచార నిందితుడిని ఉరితీయాలి

ఇబ్రహీంపట్నం: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుకు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల నర్సింహ.. చాక్లెట్ ఆశ చూపి లైంగిక దాడికి ఒడిగట్టడం చాలా దారుణమన్నారు. ఇలాంటి నిందితులను ఉరితీయాలన్నారు. బాధిత బాలికకు ఉచితంగా మెరుగైన చికిత్స అందించి, ప్రభుత్వ సంరక్షణలో ఉంచుకోవాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, నియోజకవర్గ అధ్యక్షుడు మంఖాల ఉదయ్‌కుమార్, వెంకటేశ్, నర్సింహ్మ, ఎం.శ్రీనివాస్, అనిల్‌కుమార్, కిరణ్, అశోక్, ప్రవీణ్ ఉన్నారు.



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు